ప్రజాశక్తి

మంగళవారం 27 ఆగస్టు 2024

5

అల్లూరి సీతారామరాజు



విద్యార్థుల కుటుంబాలకు
రూ.కోటి పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి -చింతపల్లి : అచ్యుతాపురం ఫార్మా కంపెనీ ఘటనలో మృత్యువాత పడిన కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించడం శుభ పరిణామమని, అదే విధంగా కోటవురట్ల మండలం కైలాసపట్నం ప్రైవేట్ క్రిస్టియన్ మిషనరీ వసతి గృహంలో విషాహారం తిని మృతి చెందిన బాధిత కుటుంబాలకు అదే విధంగా చెల్లించాలని చింతపల్లి, కొయ్యూరు జెడ్పిటిసి సభ్యులు పోతురాజు బాలయ్య, వార నూకరాజులు కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఏ సంఘటన ఏ విధంగా జరిగినా మృతులు మనుషులే కదా... అని వారు ప్రశ్నించారు. గిరిజనులంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వానికి చులకన చూపుగా ఉందని వారు మండిపడ్డారు.విద్యార్థుల కుటుంబాలకు కూడా కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఎన్డిఏ కూటమి ప్రభుత్వం మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని, ప్రజా సంఘాలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట ఏదీ?

-యథేచ్ఛగా నిర్మాణాలు -1/70 చట్టానికి తూట్లు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ:మండలంలోని పద్మాపురం పంచాయతీ ఎండపల్లి వలస, పద్మాపురం జంక్షన్, జ్యోతి థియేటర్ జంక్షన్లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు పెరిగి పోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 భూ బదలాయింపు చట్టం అమల్లో ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కి కొంతమంది గిరిజనేతరులు బినామీ పేర్లతో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఒకపక్క ఇళ్ల నిర్మాణాలు గిరిజన చట్టాలకు విరుద్ధంగా జరుగు తుండగా మరోపక్క పద్మాపురం జంక్షన్ మొదలుకొని సినిమా హాలు బ్రిడ్జి వరకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలు, షాపులు యదేచ్ఛగా నిర్మిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు అరికట్టవలసిన రెవెన్యూ, పంచాయతీ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడంతో అక్రమ నిర్మాణాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి.అయినా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానిక జ్యోతి థియేటర్ సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా ఐదుగురు గిరిజనేతరులు వాణిజ్య సముదాయమును నిర్మిస్తున్నారు. అరకు ఎండపల్లి వలస ప్రధాన రహదారిలోని ఇరువైపులా ఈ వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నప్పటికీ అధికారులు కనీసం స్పందించకపోవడం గమనార్హం. అక్రమ నిర్మాణాలు అరికట్టాలని ఎన్నిసార్లు రెవెన్యూ యంత్రాంగానికి విన్నవించినా ఫలితం లేకపోయిందని స్థానిక వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అనుమతి లేకుండా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని గిరిజనులు గిరిజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.



ముంచంగిపుట్టులో నిర్మిస్తున్న అక్రమ కట్టడం



అరకులోయ మండలం ఎండపల్లి వలసలోని సినిమా హాల్ జంక్షన్ సమీపంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న వాణిజ్యసముదాయం

అధికారుల ఆదేశాలు బేఖాతర్

ముంచింగిపుట్టు : మండల కేంద్రంలో జిసిసి గోదాము ఎదురుగా ఎంపీడీవో క్వార్టర్స్‌కి ఆనుకొని, తాత్కాలిక ఎంఈఓ కార్యాలయ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో గిరిజనేత్రురుడు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నాడు. ఈ విషయంపై గతంలో ఆదివాసి గిరిజన, ప్రజా సంఘాలు అప్పటి తహశీల్దార్ రఫీ జాన్‌కు ఫిర్యాదు చేశారు. మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవికుమార్, స్థానిక వీఆర్వో రమేష్, సర్వేయర్ దామోదరం, వీఆర్ఏ గాసన్న అక్రమ నిర్మాణ స్థలానికి వెళ్లి కట్టడాలను నిలుపుదల చేయాలని గతంలో నోటీస్ ఇచ్చారు. అయినప్పటికీ ప్రభుత్వ అధికారుల సూచనలను అతిక్రమించి ఎత్తుగా తార్పాలిన్ కవర్లు చుట్టూ కట్టి గుట్టు చప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలను యధావిధిగా కొనసాగిస్తున్నారు. అక్రమ కట్టడాన్ని నిలుపుదల చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల ఆదేశాలను వ్యతిరేకిస్తూ అక్రమ కట్టడాలను కొనసాగిస్తున్న గిరిజన నేతరుడు పై ఎల్‌టిఆర్ కేసు నమోదు చేసి, 1/ 70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసి గిరిజన, ప్రజా సంఘ నేతలు డిమాండ్ చేశారు. అక్రమ కట్టడాలపై జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్లు తక్షణమే స్పందించి అక్రమాలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

జనావాసాల్లోకి విషసర్పాలు

జెన్‌కో ఆసుపత్రిలో దూరి హల్‌చల్ చేసిన కింగ్‌కోబ్రా

బంధించి, గ్రామం పక్కనే వదిలేసిన అటవీశాఖ సిబ్బంది

రెండు నెలల వ్యవధిలో గ్రామంలోని ఆరేడు గిరినాగులు

బెంబేలెత్తుతున్న మోతుగూడెం మన్యవాసులు



జెన్‌కో ఆసుపత్రిలో దూరి, ఒపి గదిలో కుర్చీ కింద తిష్టవేసిన కింగ్‌కోబ్రా

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం, మోతుగూడెం గ్రామంలో కొద్దిరోజులుగా విషసర్పాలు బెడద తీవ్రంగా ఉంది, గోదావరి వరదలు వచ్చి వెలసిన తర్వాత గ్రామంలోని జనావాసాల్లోని విషసర్పాలు చొరబడి ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. గడచిన రెండు నెలల వ్యవధిలో 14అడుగుల పొడవున్న దాదాపు ఆరేడు కింగ్‌కోబ్రాలు (గిరినాగులు)తోపాటు కొండచిలువలు, ఇతర విషసర్పాలు, కీటకాలు గ్రామాల్లోకి, ఇళ్లల్లోకి చొరబడి ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి. తాజాగా ఆదివారం రాత్రి ఏడున్నర గంటల సమయంలో జెన్‌కో ఆసుపత్రిలోకి దాదాపు నాలుగు మీటర్లు పొడవున్న భారీ కింగ్‌కోబ్రా (గిరనాగు) చొరబడింది. దీంతో ఆసుపత్రిలోని సిబ్బందితోపాటు రోగులు, స్థానికులు భయాందోళన చెందారు. ఒపి రూములోకి చొరబడిన కింగ్‌కోబ్రాను గుర్తించిన సిబ్బంది ఆ గదికి గొళ్లెం పెట్టి, అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో వచ్చిన ఫారెస్ట్ సిబ్బంది గిరినాగును బంధించి, ఆసుపత్రి బయటకు తీసుకెళ్లి వదిలిపెట్టారు.

ఆసుపత్రి పక్కనే సర్కిల్ కార్యాలయం, ఆటుపక్కనే డిఎవి పాఠశాల ఉండడంతో పట్టుకున్న కింగ్‌కోబ్రాను అక్కడే వదిలేయడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఆరేడు కింగ్‌కోబ్రాలు జనావాసాల్లోకి రాగా, వచ్చిన గిరినాగును పట్టుకుని గ్రామానికి సమీపంలోనే వదిలిపెట్టడం వల్ల మళ్ళీ అది ఎపుడు తిరిగొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. గిరినాగుల సంచారంతో జెన్‌కో ఉద్యోగులు, డిఎవి పాఠశాల విద్యార్థులు, సిబ్బంది మోతుగూడెం గ్రామస్తులు ఆందోళన చెందుతూ, వాటి బెడద నివారించాలని కోరుతున్నారు.

గిరిజన గ్రామాలకు నిలిచిన రోడ్డు పనులు

ప్రజాశక్తి-అనంతగిరి:ఫారెస్ట్ అధికారుల అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో మండలంలో జరుగుతున్న రింగ్ రోడ్డు పనులు నిలిచి పోయాయి. మండలంలోని పెద్దకోట, పిలకోట, కివర్ల, పెద్దకోట మెయిన్ రోడ్డు, బొర్రాపాలెం మొదలుకొని టంగలబంద వరకు సుమారు 15 గ్రామాలు 11 కిలో మీటర్ల దూరం మేర రోడ్డు నిర్మాణానికి 2020-21 సంవత్సరంలో ఎంజి ఎన్ఆర్ఇజిఎస్, ట్రైబల్ వెల్ఫేర్ శాఖ సుమారు 16 కోట్లు నిధులు మంజూరు చేశాయి. కాగా రింగ్ రోడ్డు పనులు మొదలు పెట్టారు. ఫార్మేషన్ రోడ్డు పనులు అనంతరం బీటి రోడ్డు నిర్మించవలసి ఉంది. ఫారెస్ట్ అధికారుల అభ్యంతరంలో పనులు నిలిచిపోయాయి. దీంతో రోడ్డంతా కోతకు గురైంది. అంతేకాకుండా రాకపోలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. గిరిజనులు అనారోగ్యానికి గురైనపుడు సరైన రోడ్డు లేక వైద్య సేవలు అందలేదు. ఫారెస్ట్ అధికారులు అనుమతులు మంజూరు చేయాలని పలు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు.



నిలిచిన జగడలమామిడి, టంకబంధ రోడ్డు

వేతన బకాయి చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న వెలుగు విఒలు

ప్రజాశక్తి -సీలేరు: వెలుగు విఒల ఆరు నెలల వేతన బకాయి తక్షణమే చెల్లించాలని విఒల యూనియన్ జికె.వీధి మండల కార్యదర్శి చిలకల రామలింగం డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని రెండు పంచాయతీల వెలుగు వర్కర్లతో ఎం.పుష్ప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం కార్యదర్శి రామలింగం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పెండింగ్ జీతాలు చెల్లించకపోగా, రాజకీయ వేధింపులు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఒలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వారి వేతనాలను చెల్లించి, వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని, ఇతర ప్రయోజనాలను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి సిరి బాల, శోభన్‌బాబు, మురళి, సోమలింగం, పరమేశ, బొంజుబాబు, వీరయ్య దొర, బాలరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ, అనంతగిరి మండలాల పరిధిలో గత ఆరు సంవత్సరాలుగా రైల్వే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26,000 చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం అరకులోయ ఆదివాసి గిరిజన సంఘం భవనంలో కే సన్యాసిరావు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, రైల్వే లైన్‌లో సుమారు 200 మంది వరకు కాంట్రాక్టర్ వద్ద పనులు చేస్తున్నారని, వీరికి అతి తక్కువ కూలి చెల్లించి గుత్తేదారుడు చేతులు దులుపుకుంటున్నాడని తెలిపారు. చట్ట ప్రకారం కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు.వీటితో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కాంట్రాక్ట్ మారినా కార్మికులను పని కొనసాగించాల న్నారు. కార్మికులకు కనీస వేతనం ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించే విధంగా రైల్వే డిపార్ట్మెంట్ కాంట్రాక్టర్లపై ఒత్తిడి చేసి అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మండల కన్వీనర్ జన్ని భగత్ రామ్, బొర్రా, బొడ్డవర, కరకవలస, చిమిడిపల్లి, త్రైడ స్టేషన్ పరిధి కార్మికులు పాల్గొన్నారు.

వరాహ నదిలో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో ఆదివారం పందూరు వద్ద వరహానదిలో గల్లంతైన సుంకర పెద పోతురాజు మృతదేహం సోమవారం ఉదయం బయటపడింది. గ్రామస్తులతో పాటు వేములపూడి గ్రామానికి చెందిన గజ ఈతగాళ్ల సహకారంతో నదిలో గాలించారు. గల్లంతయిన ప్రదేశం సమీపంలోనే మృతదేహం లభ్యమైంది. గాలింపు కోసం స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది చొరవ తీసుకున్నారు మృతదేహాన్ని స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు బోరున విలపించి కన్నీటి పర్యంతమయ్యారు. సహాయక చర్యల్లో ఏఎస్ఐ గంగరాజు, స్థానిక వీఆర్వో ఆశారత్నం, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్డి వద్ద తుప్పల తొలగింపు

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- కోటవురట్ల:మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మొక్కల మాటున మరుగుదొడ్ల అంటూ సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందన లభించింది. పాఠశాల స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, సిబ్బంది స్పందించారు. మరుగుదొడ్డి వద్ద ఉన్న తుప్పలను తొలగించారు. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం చేశారు. అదేవిధంగా పాఠశాల ఆవరణ, గ్రౌండ్లో తుప్పలను తొలగించాలని కోరారు.



తుప్పలు తొలగిస్తున్న కూలీ

ముంపు సాకుతో అభివృద్ధికి ఆటంకం దుర్మార్గం

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నేత నాగేశ్వరరావు

ప్రజాశక్తి-కూనవరం : పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో గోదావరి, దాని ఉపనదుల ముంపు పేరుతో ప్రభావిత గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించకపోవడం దుర్మార్గమనిసిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు విమర్శించారు. సోమవారం మండలంలోని గొమ్ము అయ్యవారిగూడెం గ్రామంలో కర్నాటి శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ గోదావరికి 35 అడుగులు వదర వస్తే తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం లేకుండా పోతుందని, గోదావరి వరదలున్నంత కాలం అంధకారంలో మగ్గే పరిస్థితులకు విముక్తి కల్పిస్తూ, కొత్తగా ఎత్తైన విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామానికి మంచినీటి సదుపాయం అందించాలని కోరారు. గ్రామానికి బిటి రోడ్డు, గ్రామంలో అంతర్గతంగా వీధుల్లో సిసి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. కొండాయిగూడెం గ్రామంలో బరకాలు వేసిన షెడ్‌లో పాఠశాలకు నడుపుతున్న దుస్థితిని గమనించి, ఆ భవనానికి మరమ్మతులు, కొత్త భవనం నిర్మాణం చేపట్టాలని కోరారు.

అలాగే చిన్న ఆర్యూర్ గ్రామాలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. ముంపు ప్రభావిత గ్రామాల్లో సమస్యల పరిష్కారం, సౌకర్యాలను కల్పించకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఆందోళన, ప్రత్యక్ష పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జయసుధ, సర్పంచ్ నాగమణి, ధన్నూరి శ్రీనివాసరావు, మడెం బాబూరావు, నారాయణరావు, సీతయ్య, వెంకటరామారావు, రవీంద్ర, సందీప్ తదితరులు పాల్గొన్నారు

పిహెచ్‌సికి రోగుల తాకిడి



క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న రోగులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: సీజనల్ జ్వరాలు, వ్యాధులతో బాధపడుతూ పెద్దసంఖ్యలో రోగులు స్థానికి పిహెచ్‌సికి సోమవారం తరలివచ్చారు. అయితే శ్రీకృష్ణాష్టమి ప్రభుత్వ సెలవు దినం కావడంతో వైద్యులు అందుబాటులో లేకపోవడం, కొద్దిమంది సిబ్బంది మాత్రమే సేవలు అందించడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు ఇక్కట్లకు గురయ్యారు

టైఫాయిడ్, మలేరియా, ఇతరత్రా జ్వరాలతోపాటు ఒళ్లు, కీళ్లనొప్పులు, వాంతులు, విరోచనాలు వంటిఅ నారోగ్య సమస్యలతో వచ్చిన రోగులంతా ఆసుపత్రిలో క్యూకట్టి వైద్యసేవలు కోసం పడిగాపులు పడ్డారు. ప్రభుత్వ ఆసుపత్రిలో తక్కువ సిబ్బంది ఉండడంతో రోగులు అవస్థలు పడడమే కాకుండా, ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడింది. రక్తపూతలు సేకరించేందుకు కూడా సిబ్బంది అందుబాటులో లేరని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు, దీంతో పలువురు రోగులు నిరాశతో వెనుదిరిగి, ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించి వైద్యసేవలు పొందారు డాక్టర్ ఫీజులు, మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు అధిక డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు రోగులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ శిరీష దృష్టికి ఫోనులో తీసుకెళ్లగా, తగు చర్యలు చేపడతానన్నారు.

మనసులను కరిగించే ఐస్‌గెడ్డ అందాలు!

- మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతి సోయగం
- మైమరిచిపోతున్న ప్రకృతి ప్రేమికులు, సందర్శకులు



ఐస్‌గెడ్డ జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు సమీపంలోని ఐస్ గెడ్డ జలపాతం అందాలు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికుల మనస్సులను దోచుకుని మైమరిపించ జేస్తున్నాయి. ఇటివల కురిసిన భారీ వర్షాలకు ఎత్తైన కొండలపై నుంచి తెల్లనిపాల నురగను తలపించేలా జాలువారే జలపాతాలు ఉరకలేస్తూ కిందకు దూకుతుండడంతో, ఆ సోయగాలు చూసి, సందర్శకులు వింత అనుభూతిని పొందుతున్నారు. చింతపల్లి నుంచి దారి పొడవునా ప్రకృతి సోయగాలతో పాటు పచ్చని చెట్లు, ఎత్తయిన కొండలు ధారాలమ్మ ఘాట్ రోడ్లో రైన్ గేజ్ వద్ద మంచు అందాలు చూపరుల మనసులను హత్తుకుంటున్నాయి. దారాలమ్మ ఆలయానికి మొక్కులు తీర్చుకోవడానికి వచ్చిన భక్తులు, పర్యాటకులు ఆలయానికి సమీపంలో ఎత్తైన కొండల నడుమ జాలువారే జలపాతాలు, సుందర దృశ్యాలను తమ కెమెరాలలో బంధిస్తూ, సెల్ఫీలను తీసుకుంటూ మంత్రముగ్ధులై సందడి చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా మరింత తీర్చిదిద్దితే సందర్శకుల తాకిడి మరింత పెరుగుతుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, అల్లూరి జిల్లా మన్యం ప్రాంతంలో ప్రకృతి సుందరమైన ప్రదేశాలను, ప్రాంతాలను పర్యాటకంగా తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.



ధారకొండ ఘాట్‌రోడ్డులో మంచు దుప్పటి కప్పుకున్న మన్యం అందాలు

అనారోగ్యంతో బోర్ మెకానిక్ మృతి

ప్రజాశక్తి-చింతూరు. : మండలంలోని చట్టి గ్రామంలో కొన్నేళ్లుగా బోర్ మెకానిక్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న శ్యామల రామయ్య అనే వ్యక్తి అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున అకాల మరణం పొందాడు. మారుమూల గ్రామాల్లో మరమ్మతులకు గురైన చేతిపంపులను ప్రజలు పిలిచిందే తడవుగా ఆయా గ్రామాలకు వెళ్లి బాగుచేసి, తాగునీటిని అందించిన రామయ్య మరణంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోర్ మెకానిక్ శ్యామల రామయ్య కుటుంబానికి స్థానిక పంచాయతీ కార్యదర్శి నరేడ్ల రఘు రూ.పదివేల నగదును అందజేశారు. రామయ్య మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం

అరకులోయ రూరల్:మండలంలోని పెదలబుడు మేజర్ పంచాయతీ సరభగుడ, తాంగుల గుడ గ్రామంలో సోమవారం రాధా కృష్ణ దేవాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు.రాధాకృష్ణ దేవాలయాల భక్తులతో కిటకిట లాడాయి. పిల్లలకు కృష్ణుడి వేషం వేసి ఊరేగించారు. రాధా కృష్ణ దేవాలయం వద్ద కమిటీ ప్రతినిధులు కిల్లో జగన్నాథం,హరి, జలంధర్, అప్పన్న, మాట్లాడుతూ, మంగళవారం ఉట్టి కొట్టే కార్యక్రమం, ఊరేగింపు జరుగుతాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అన్నసమారాధన

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, చికిలింత పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ఆలయ కమిటీల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజవొమ్మంగి కృష్ణుని గుడి వద్ద ఆలయ కమిటీ నిర్వాహకులు కొప్పు సూరిబాబు, తదితరుల ఆధ్వర్యంలో మూడువేల మందికి అన్నసమారాధన నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గోపికకృష్ణుల వేషధారణలు, ఉట్టికొట్టే ఉత్సవం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించగా, పెద్దసంఖ్యలో ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

సీలేరు: జికె వీధి మండలం సీలేరు, దారకొండ గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సీలేరులో గణపతి సెంటర్, రామాలయం సెంటర్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.స్వామి, గోపిక వేషధారణలో చిన్నారులు అలరించారు. దారకొండలో చెట్టు భజన బృందం, బాణాసంచాలు నడుమ దారకొండలో ఉట్టికొట్టే వేడుకను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న పంచాయతీ, రెవెన్యూ అధికారులు

అక్రమ నిర్మాణం తొలగింపు

ప్రజాశక్తి-అరకులోయరూరల్:అరకులోయ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను సోమవారం రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది తొలగించారు. ఈ అక్రమ నిర్మాణాలు గతంలోనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలుపుదల చేశారు.మళ్లీ కొంత మంది సహకారంతో యథావిధిగా గత కొద్దిరోజుల నుండి నిర్మాణ పనులు చేపడుతున్నారు. గత ఐదు సంవత్సరాల క్రితం ప్రభుత్వ స్థలంలో రెవెన్యూ, పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. హెచ్చరిక బోర్డు ఉన్నప్పటికీ వాటిని వ్యతిరేకించి కొంతమంది అధికార పార్టీ నాయకులు అండదండలతో గుట్టు చప్పుడు కాకుండా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణంపై స్థానిక ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కలెక్టర్, సబ్ కలెక్టర్కు ఫిర్యాదుతో రెవెన్యూ పంచాయతీ సిబ్బంది నిర్మాణ పనులు నిలుపుదల చేశారు. అక్రమంగా ఏర్పాటు చేసిన కంచెలు,రేకులను సిబ్బంది తొలగించారు. మళ్ళీ నిర్మాణ పనులు ప్రారంభిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది హెచ్చరించారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అర్జీలు స్వీకరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించే ప్రక్రియను విరమించుకొని, ప్రభుత్వ కార్యాలయాల్లో చేపట్టాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు మధ్య ఉండాల్సిన విభజన రేఖను చెరిపివేసే విధంగా రాష్ట్రంలోని అధికార కూటమి పార్టీలు వ్యవహరించడం తగదని పేర్కొన్నారు. ప్రజాసమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం, అధికార పదవుల నిర్వహించేవారి బాధ్యత అని తెలిపారు. సమస్యలు పరిష్కరించమని కోరుతూ ఏ రాజకీయ అభిప్రాయాలు లేనివారు, అనేక రాజకీయ అభిప్రాయాలు కలిగిన ప్రజలు అర్జీలు, ఫిర్యాదులు అందజేస్తారని వివరించారు. ప్రజాసమస్యల నివేదనకు ప్రభుత్వ కార్యాలయాలే తగిన వేదికలని, కనుక అక్కడే అర్జీలు, ఫిర్యాదులను స్వీకరించాలని కోరారు.



బురదమయంగా ఉన్న టీచర్స్ కాలనీ రోడ్లు

టీచర్స్ కాలనీ బురదమయం

పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్

మండల కేంద్రంలోని టీచర్స్ కాలనీలో సీసీ రోడ్డు లేక బురదమయంగా మారుతుండటంతో స్థానికలు ఇబ్బందులు పడుతున్నారు. టీచర్ కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మించక పోవడంతో వర్షాకాలంలో కాలనీవాసులు రాకపోకలు సాగించడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్డుపై వర్షపు నీరంతా నిల్వ ఉండి పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో, ఆ రోడ్డులో ఖాళీ నడకన నడచి వెళ్లడానికి, వాహనాలతో వెళ్లడానికి కూడా పలు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని సందర్భంలో ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపోయి పడిపోయిన సంఘటనలు పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైయినేజీ లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు మురుగు నీరు నివాసగృహాల పరిసరాల్లో నిల్వ ఉండటంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. కాలనీ వాసులకు అవసరమైన చోట సీసీ రోడ్డు నిర్మించకుండా, అవసరం లేని చోట ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు చెప్పారు.సంబంధిత పంచాయతీ అధికారులకు సీసీ రోడ్లు, వీది కాలువలు నిర్మించాలని పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆసుపత్రిలో మంటలు

భయంతో పరుగులు తీసిన బాలింతలు, రోగులు
విద్యుత్ సహాయకుడు లక్ష్మణ్‌కు గాయాలు



ధ్వంసమైన విద్యుత్ పరికరాలు

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విద్యుత్ సహాయకుడు లక్ష్మణరావుకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో మంటలు చెలరేగడంతో పాటు దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రిలో పొగ కమ్ము కోవడంతో బాలింతలు, రోగులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న విద్యుత్తు సహాయకుడు గుల్లేలి లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ షాక్ కు గురైన లక్ష్మణరావుకు స్థానిక ఆసుపత్రి వైద్యాధికారులు ప్రథమ చికిత్స అందించారు.

ఇదిలా ఉండగా బ్రిటీష్ కాలం నాటి ఆసుపత్రి కావడంతో ప్రతిసారి విద్యుత్ మరమ్మత్తులకు గురవుతోంది. దీంతో మరమ్మత్తులు చేస్తూ విద్యుత్ సహాయకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన ప్రదేశానికి సమీపంలోనే నవజాత శిశువుల వార్డు ఉంది. ఇటువంటి సంఘటనలు పునరావృతమయితే నవజాత శిశువుల వార్డులోని శిశువులతో పాటు బాలింతలు, సహాయకులు ప్రమాదానికి గురైయ్యే అవకాశాలు లేకపోలేదని ఈ ప్రాంతీయులు, ఆసుపత్రి రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గాయాలతో చికిత్స పొందుతన్న విద్యుత్ సహాయకుడు లక్ష్మణ్

హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను ఏయూ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎంవిఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్‌బాబులు ముందుగా మెస్‌ల్లో భోజన నాణ్యత స్వయంగా పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను రుచిచూసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లను తనిఖీ చేశారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని ఎం జగన్నాధపురం గ్రామంలో సోమవారం సాయంత్రం భీముని అప్పలనరస (65) అనే మహిళ పొలంలో గడ్డి కోస్తుండగా తెగిపడి ఉన్న విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పొలానికి గడ్డి కోసేందుకు వెళ్లిన అప్పలనరస ఎంతకీ రాకపోవడంతో ఆందోళన చెందిన ఆమె కుమారులు, కోడళ్లు కంగారుగా పొలానికి వెళ్లి గాలించారు. అప్పటికే విద్యుత్‌షాక్‌తో అమె మృతి చెందిఉండడాన్ని గమనించి పోలీసులకు, విద్యుత్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు.

ఎయు రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు ఇఎన్.ధనుంజయరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులను స్వీకరించారు. ఎయు రెక్టార్‌గా ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణ, సీడీసీ డీన్‌గా ఆచార్య టివి.కృష్ణ, స్టూడెంట్ ఎఫైర్స్ ఇంచార్జి డీన్‌గా డాక్టర్ జి.రాంబాబు, ఎఇఆర్‌సి గౌరవ డైరెక్టర్‌గా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.వెంకటరమణ, స్టూడెంట్ ఎఫైర్స్ అసోసియేట్ డీన్‌లుగా డాక్టర్ ఎన్ఎం.యుగంధర్, డాక్టర్ ఎస్.హరనాథ్, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి.రామారావు, ఐఎఎస్ఇ ఇంచార్జి ప్రిన్సిపల్‌గా డాక్టర్ డి.నాగరాజకుమారిలు నియమితులయ్యారు.

బాధ్యతల స్వీకరణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఇఎన్.ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం ఆచార్య ధనుంజయరావు ఎయు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సుదీర్ఘ కాలం నుంచి సేవలందిస్తున్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవడం, జాతీయ స్థాయిలో ఎయు ఇమేజ్ పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రత్యేకం. ఆచార్య ధనుంజయరావు ప్రత్యేక చొరవతో ఎయు వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థులకు స్థానం కల్పించడం సాధ్యపడింది.

ఆచార్య ధనుంజయరావు గతంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఇంచార్జి వీసీగా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్, ఒఎన్‌జిసి, డిఎస్‌టికి సంబంధించిన విభిన్న ప్రాజెక్టులను ఆయన నిర్వహించారు.

రెక్టార్‌గా కిషోర్‌బాబు

ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు ఎన్.కిషోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. ఆయన 30 సంవత్సరాల బోధన అనుభవం కలిగి ఉన్నారు. ఏయూ అకడమిక్ డీన్‌గా, రిజిస్ట్రార్‌గా, రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా గతంలో పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఏపి ఐసెట్ కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో 36 మంది పిహెచ్‌డిలు అందుకున్నారు. ఆచార్య కిషోర్ బాబు 11 పుస్తకాలను రచించారు, 60 కిపైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. ఐఎస్‌టిడి నేషనల్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నారు.

డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలకు సర్టిఫికెట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) శాస్త్రవేత్తలకు ఆర్ అండ్ డి మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించింది. భారత్‌లోని 36 డిఆర్‌డిఒ ల్యాబ్‌లకు చెందిన 39 మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు పాల్గొనేవారికి శిక్షణ మాడ్యూల్స్, ప్రోగ్రామ్ ఫలితాల వివరాలు తెలియజేసారు. ఆర్ అండ్ డి మేనేజ్ మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సిమ్యులేషన్, ఆర్గనైజేషన్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ మేనేజ్ మెంట్, ఆర్ అండ్ డి ప్రాసెస్స్, ఆర్ అండ్ డి సపోర్ట్ ఫంక్షన్స్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, వాణిజ్యీకరణ, వినియోగం, ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీని పెంపొందించడం, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి కాన్సెప్ట్స్ అండ్ ప్రిన్సిపల్స్‌తో సహా వివిధ మాడ్యూల్స్‌ను ఈ ప్రోగ్రామ్ లో పొందుపరిచారు.



శంకుస్థాపన చేస్తున్న కూటమి నేతలు

విద్యుత్ లైన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-కూనవరం :మండలంలోని నర్సింగపేట నుండి పోలిపాక వరకు కొత్త విద్యుత్ లైన్ పనులకు సోమవారం మాజీ ఎంపిపి సోడే రామయ్య, ఇతర టిడిపి నేతలు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాలకు విద్యుత్ లైన్ ఏర్పాటుకు స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి రూ.25 లక్షలను మంజూరు చేశారని, వచ్చిన నిధులతో పనులను చేపట్టేందుకు నర్సింగపేట గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గోదావరి వరదల సమయంలో కొత్తగా వేస్తున్న ఈ విద్యుత్ లైన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, 70 అడుగులు వరదలు వచ్చినా విద్యుత్ కోత, ఇతర అంతరాయాలకు ఆస్కారం లేకుండా విద్యుత్‌లైన్ నిర్మాణం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగు యువత అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి గడేసుల రంజిత్ కుమార్, సీనియర్ నాయకులు గడ్డిపాటి ప్రసాద్, కొక్కిరేణి ఆదినారాయణ, నోముల సత్యనారాయణ, చెలికాని ఉమ, బట్టు భాస్కర రావు, చందు, గడేసుల సత్యనారాయణ, మడకం చిన్ని శాయిలి బుచ్చిరాజు, దాసరి శ్రీను, సోడే రమేష్, ఆకుల రాజేష్, పరిటాల వెంకన్న, తోటకూర వెంకటప్పయ్య, బిజెపి నేతలు నోముల రామారావు నోముల సత్యనారాయణ, తెలుగు యువత దగ్గుబెల్లి వినోద్, కుర్రా గంగాధర్, మేడి ప్రవీణ్, మేడి రాము, సాని రాజా రవీంధ్ర, బొల్లి ఏసు పాల్గొన్నారు

బొల్లి వెంకన్న మృతి తీరనిలోటు

ప్రజాశక్తి - ఎటపాక: మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన సిపిఐ నేత బొల్లి వెంకన్న గుండెపోటుతో అకాల మరణం చెందాడు. ఆయన పార్థివదేహంపై సిపిఐ జెండా కప్పిన ఆ పార్టీ నేతలు, ఘననివాళులు అర్పించారు. బొల్లి వెంకన్న మృతి పార్టీకి తీరని లోటని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ అన్నారు. బొల్లి వెంకన్న మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో గన్నవరం సర్పంచ్ గడ్డం భద్రామ్మ, ఎంపిటిసి కంటె రాజు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ మంత్రి నారాయణ రాక

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ విశాఖ నగరంలోని జివిఎంసి, విఎంఆర్‌డిఎ కార్యక్రమాలపై సమీక్షించి క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు మంగళవారం నగరానికి విచ్చేస్తున్నారు. దీంట్లో భాగంగా కాపులుప్పాడ వద్ద గల వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌లో ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకూ సమీక్ష చేపట్టనున్నారు. మంత్రితో పాటు జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొననున్నారు. ఆ తర్వాత జివిఎంసి కార్యాలయంలో అధికారులతో మంత్రి సమావేశం కానున్నారు. 9 గంటల నుంచి 11 గంటల వరకూ విఎంఆర్‌డిఎ వికెపిసిఆర్ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షించనున్నారు. మధ్యాహ్నం నుంచి స్థానిక అధికార పార్టీ ప్రజాప్రతినిధులతో సమావేశం కానున్నారు..

టిడిఆర్‌లపై చర్చ ఉంటుందా ?

రాష్ట్ర మున్సిపల్ మంత్రి స్వయంగా విశాఖకు విచ్చేస్తున్న సందర్భంగా గతంలో జివిఎంసి నుంచి అడ్డగోలుగా పొందిన ట్రాన్స్‌ఫరేబుల్ డవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్)పై చర్చ జరగనుందా ? తగు చర్యలు తీసుకోనున్నారా ? అన్న చర్చ జివిఎంసి ఉద్యోగులు, అధికారుల్లో కొనసాగుతోంది. 2015 నుంచి ఈ టిడిఆర్‌ల సమస్య ఉంది. రూ.కోట్లలో అవినీతి భాగోతాలు నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పలు కుంభకోణాలు జరిగాయి. వీటన్నిటిపైనా మంత్రి ఎలా స్పందిస్తారో చూడాల్సిందే. నగరంలోని మధురవాడ, గాజువాక, విశాఖ నగరం అంతటా ఈ టిడిఆర్‌ల కుంభకోణాలు గతంలో వెలుగు చూశాయి.

పాత పెన్షన్ విధానానికి..

ఏకీకృత పెన్షన్ పథకం ప్రత్యామ్నాయం కాదు

సిఐటియు అఖిల భారత కార్యదర్శి కెఎన్.ఉమేష్



మాట్లాడుతున్న ఉమేష్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని మోడీ మంత్రివర్గం ఆమోదించిన ఏకీకృత పెన్షన్ పథకం పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం కాదని, దీనిని అందరూ వ్యతిరేకించాలని, పాత పెన్షన్ విధానం కోసం పోరాటాన్ని కొనసాగించాలని సిఐటియు అఖిల భారత కార్యదర్శి కెఎన్.ఉమేష్ అన్నారు. విశాఖపట్నం డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'ఎనిమిదవ వేతన సంఘం ఏర్పాటు - ఒపిఎస్ సాధనలో కార్మిక వర్గ పాత్ర' సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాలలో త్వరలో జరగబోతున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అక్కడ లబ్ధి పొందడం కోసమే ఏకీకృత పెన్షన్ విధానాన్ని మోడీ ప్రభుత్వం ప్రకటించిందని చెప్పారు. ప్రపంచీకరణలో అంతర్భాగంగా ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు 2004లో నూతన పెన్షన్ విధానాన్ని కాంగ్రెస్, బిజెపి రెండూ కలిపి తీసుకుని వచ్చాయని గుర్తు చేశారు. 97 లక్షల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ నిధులు రూ.10.68 లక్షల కోట్లు షేర్ మార్కెట్లో ఉన్నాయని, పెట్టుబడిదారులకు మరింత ప్రయోజనాలు చేకూర్చడం కోసం ప్రభుత్వ వాటాను 4.5 శాతం పెంచారని తెలియజేశారు. 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తరువాత నూతన పెన్షన్ విధానంలో పెన్షన్ గ్యారంటీ కల్పించారని తెలిపారు. కార్మికులు దగ్గర నుంచి ప్రతినెలా వసూలు చేసే పది శాతం కాంట్రిబ్యూషన్ లేకుండా పాత పెన్షన్ విధానంలాగనే అందరికీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో ఏ వేతన సంఘం సిఫార్సులూ అమలు కాలేదని, పోరాటం చేయకుండా వేతన సంఘాలు ఏర్పడలేదని, చేసిన సిఫార్సుల అమలుకు పోరాటాలు చేయవలసి వచ్చిందని తెలిపారు. 8వ వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేటీకరణకు, ప్రైవేటీకరణకు, కార్మిక కోడ్స్ పేరుతో కార్మిక చట్టాల మార్పునకు వ్యతిరేకంగానూ, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ విశాల ఐక్యతతో నేడు దేశంలో కార్మిక ఉద్యమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎఐడిఇఎఫ్ మాజీ అదనపు కార్యదర్శి గుహతకుర్తా మాట్లాడుతూ పెన్షన్ భిక్ష కాదని, కార్మికుల హక్కు అని సుప్రీంకోర్టు విశదీకరించిందని, 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాలు ఫలితంగా ప్రభుత్వంలో కదలిక వచ్చిందని గుర్తు చేశారు. ఆయన చేసిన ప్రతిపాదన మేరకు ప్రభుత్వం ప్రకటించిన కేంద్రీకృత పెన్షన్ విధానం సరైనది కాదని, పాత పెన్షన్ విధాన సాధన కోసం ఐక్య పోరాటాలు కొనసాగించాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సదస్సుకు అధ్యక్షత వహించిన డిఫెన్స్ కో-ఆర్డినేషన్ కమిటీ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ విధానమే మంచిదైతే దేశంలోని పార్లమెంటు, శాసనసభ్యులు అందరూ తీసుకోవాలని, వారు అనుభవిస్తున్న పాత పెన్షన్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అమలు జరపాలని డిమాండ్ చేశారు. మోడీ మాయమాటలు నమ్మి ఏకీకృత పెన్షన్ విధానానికి వంత పాడొద్దని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్‌జిఒ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు కె.ఈశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో గత ప్రభుత్వం చెప్పిన గ్యారెంటీడ్ పెన్షన్ స్కీమ్‌కి, కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ఏకీకృత పెన్షన్ స్కీమ్‌కి పెద్దగా తేడా లేదని, అందరూ వీటిని వ్యతిరేకించాలని కోరారు. పాత పెన్షన్ విధాన సాధన కోసం ఎప్పటిలాగానే ఐక్య పోరాటం పోరాటం కొనసాగిద్దామని అన్నారు. రైల్వే లోకో రన్నింగ్ స్టాఫ్ డివిజన్ కార్యదర్శి బోలేనాథ్ మాట్లాడుతూ ఏకీకృత పెన్షన్ ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదన్నారు. అనంతరం సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.నాగేశ్వరరావు, టిఎన్‌టియుసి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నాగార్జున సదస్సులో మాట్లాడారు. నావెల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జి.అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మా ప్రమాదాలన్నీ యాజమాన్యాల హత్యలే

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఫార్మా సిటీలో జరుగుతున్న వరుస ప్రమాదాలన్నీ యాజమాన్యాల హత్యలే అని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. ఎసెన్షియా ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు చెల్లించిన విధంగానే పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ కంపెనీలో చనిపోయిన వారికీ రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఇండస్ ఆసుపత్రి ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ఆందోళనకు దిగారు. సినర్జిన్ ఫార్మా ప్రమాదంలో గాయపడి ఇండస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విజయనగరం జిల్లా వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ కుటుంబ సభ్యులతో కలిసి ఈ ఆందోళన చేపట్టారు. ఎసెన్షియా ఘటనలో ప్రధానమంత్రి ప్రకటించిన రూ.2 లక్షలు, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షలను సినర్జిన్ మృతులకూ ఇవ్వాలని నినదించారు. ఈ ఆందోళనను ఉద్దేశించి కుమార్‌తో పాటు సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ కూడా మాట్లాడారు. ఫార్మా సిటీలో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయన్నారు. యాజమాన్యాల నిర్లక్ష్యమే ప్రమాదాలకు కారణమని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన జిఒ నెంబరు 64ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు కారణమైన కంపెనీల యాజమాన్యాలను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి ప్రాంతాల్లో విస్తారంగా ఫార్మా కంపెనీలు వున్నా ఒక్క సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రీ లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే ఆ ప్రాంతంలో బర్నింగ్ యూనిట్‌తో కూడిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్మించాలన్నారు. ఆందోళనకు స్పందించి సినర్జిన్ యాజమాన్యం, అధికారులు వెంటనే రూ.కోటి చెక్కును మృతుని భార్యకు అందజేశారు.



సీలేరు రెగ్యులేటరీ డ్యాంపై తిష్టవేసిన పశువుల గుంపు

విచ్చలవిడిగా పశువుల సంచారంతో ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు: సీలేరు రెగ్యులేటరీ డ్యాం పై పశువులు సంచరించడంతోపాటు అక్కడే తిష్టవేసి ఉండడంతో విద్యుత్ ఉద్యోగులు, ఫిల్టర్ హౌస్‌కు, మెయిన్ డ్యాం వద్ద విధులు హాజరయ్యే సెక్యూరిటీ సిబ్బందికి తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రధానడ్యాంపైనే మకాం వేసి ఎటూకదలనని మొరాయించేలా గుంపులుగా సంచరిస్తుండడంతో ఈ మార్గంలో ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. రేయింబవళ్లు తేడా లేకుండా పశువులు గుంపులుగుంపులుగా రోడ్లపైనే నిలిచి ఉంటున్నాయని పలువురు అంటున్నారు. పశువుల పెంపకందారులు వాటిని కట్టకుండా విచ్చలవిడిగా వదిలేయడం వల్లే ఇలా రోడ్లపైనే సంచరిస్తూ ఇబ్బందులకు గురిచేయడమే కాకుండా, మందగా తిష్టవేసిన చోట పేడ వేస్తుండడంతో రోడ్లు ధ్వానంగా మారి అవస్థలు పడే పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇదే రహదారి గుండా అనునిత్యం మారమ్మ అమ్మవారి ఆలయానికి భక్తులు వచ్చిపోతూ ఉంటారు. రహదారికు అడ్డంగా పశువులు నిలిచిపోతుండడంతో వారూ అసహనానికి గురవుతున్నారు. పశువులు రోడ్లపై సంచరించకుండా సం ఢిత యజమానులను హెచ్చరించి, వాటిని నియంత్రించే చర్యలను పంచాయతీ పాలకవర్గం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బాధిత కుటుంబానికి భరోసా

ప్రజాశక్తి - ఎటపాక: వింతవ్యాధి సోకడంతో రెండు కాళ్లు కోల్పోయి, కుటుంబ పోషణ, బతుకు భారమైన అనాధ కుటుంబాన్ని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్‌ఖాన్ సోమవారం పరామర్శించి, వారి కుటుంబానికి బాసటగా ఉంటానని భరోసానిచ్చారు. మండల కేంద్రానికి చెందిన గోడేటి జగపతిరావుకు 2021లో నాలుగేళ్ల క్రితం విరికోన్ వ్యాధి సోకడంతో అప్పట్లో ఒక కాలును తొలగించారు. ఇటీవల మూడు నెలల క్రితం రెండోకాలును కూడా తొలగించారు. దీంతో కుటుంబ పోషణాధారం, పెద్దదిక్కుగా ఉన్న జగపతిరావు రెండు కాళ్లు కోల్పోవడంతో ఆ కుటుంబం బతుకు దుర్భరంగా మారింది. విషయం తెలుసుకున్న ఆయుర్వేద వైద్యులు జమాల్‌ఖాన్ సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రెండు కాళ్లు కోల్పోయిన జగపతిరావుకు కృత్రిమ కాలు అమర్చేందుక సహకరిస్తారని, అలాగే వారి ఇంటి నిర్మాణానికి తోడ్పాటు అందిస్తానని భరోసానిచ్చారు. ఆ కుటుంబంలోని పిల్లల భవిష్యత్, జీవనాధారానికి తనవంతు సహకారం ఉంటుందని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ కారం వెంకయ్య. మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ పాల్గొన్నారు.

అలరిస్తున్న సంగీత, నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ (కళాభారతి) ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఆరు రోజుల సంగీత, నృత్య, నాటక ఉత్సవాలు మూడో రోజూ అలరించాయి. సోమవారం ఈ కార్యక్రమాలను ఈస్ట్రన్, నేవల్ కమాండర్ ఎం.మురళీ మోహన్‌రాజు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విశ్వ విఖ్యాత కర్ణాటక ఈల పాట కళాకారుడు డాక్టర్ కె.శివప్రసాద్ బృందం కచేరీతో వీక్షకులను మైమరిపించింది. కష్టమైన రాగాలాపన, స్వరకల్పనలతో ఈల పాట రెండు గంటల పాటు సాగింది. కచేరీలో వయలిన్ విద్వాంసుడు మావుడూరి సత్యనారాయణ శర్మ, మృదంగం విద్వాంసుడు రామకృష్ణ, తబలాపై గుణరంజన్, కీ బోర్డుపై లాల్ కృష్ణ, మోర్సింగ్‌పై విద్వాన్ వెంకటేష్ సహకారం అందించారు. పిల్లా రమణమూర్తి వ్యాఖ్యతగా వ్యవహరించారు. అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రెజరర్ పైడా కృష్ణ ప్రసాద్, డాక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.